## మల్లికార్జునస్వామికి ఎమ్మెల్యే పూజలు



మైసమ్మగూడలో మల్లికార్జునస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, బీఆర్ఎస్ నేతలు

**మేడ్చల్ రూరల్,మార్చి10:** మేడ్చల్ మండలంలోని సోమారం, నూతనకల్ గ్రామాలతో పాటు గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధి మైసమ్మగూడలో మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో భాగంగా నూతనకల్, మైసమ్మగూడలో వేడుకల్లో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సాయంత్రం బోనాల ఊరేగింపు నిర్వహించి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సురేశ్ రెడ్డి, బీఆర్ఎస్ మేడ్చ ల్ మండల అధ్యక్షుడు దయానంద యాదవ్, మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పెంటయ్య,నాయకులు,యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

**మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 10:** ప్రజావాణిలో వచ్చిన పిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన 55 వినతులను స్వీకరించారు.కార్యక్రమంలో డీఆర్ఒ హరిప్రియ, లాఆఫీసర్ చంద్రావతి, డీఆర్డీవో సాంబశివరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**పోచారం:**పోచారం మున్సిపాలిటీ యంనంపేట్‌లో రోడ్డు,డ్రైనేజీ స్థలాలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు జరుగు తున్నాయని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు, స్థానికులు పోలగోని మధుసూదన్‌గౌడ్ ఫిర్యాదు చేశారు.

### వర్గీకరణ చేసేవరకు గ్రూప్స్ ఫలితాలు నిలిపివేయాలి

**కీసర, మార్చి 10:** ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు గ్రూప్ 2, గ్రూప్ 3 ఫలితాలను నిలుపుదల చేయాలని మండల ఎమ్మార్పీఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కీసరలోని అమరవీరుల స్తూపం వద్ద ఎమ్మార్పీఎస్ వ్యస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఆదేశాలతో ఎమ్మార్పీఎస్ నేతలు నిరసన దీక్ష చేపట్టారు.

# నాడు ఘన చరిత్ర నేడు శిథిలావస్థ

- కళా విహీనంగా గురుకుల్ విద్యాలయం
- పట్టించుకునే నాథుడు కరువు
- విద్యాలయాన్ని గాలికొదిలిన దేవాదాయశాఖ
- పూర్వ వైభవానికి పూర్వ విద్యార్థుల పట్టు



గురుకుల విద్యాలయం ముఖద్వారం



గురుకుల్‌లో శిథిలావస్థలో ఉన్న విద్యార్థులకు కర్ర సాము, ఇతర విద్యలను అభ్యాసం చేయించే సేనాఘర్

**ఘట్‌కేసర్,మార్చి10:** అది1938వ సంవత్సరం.ఘట్‌కేసర్ పట్టణంలో ఎంతో ఉన్నత ఆశయంతో గురుకుల్ రెసిడెన్షియల్ పాఠశాలను శ్రీ బన్సీలాల్ వ్యాస్ జీ ప్రారంభించారు. ఇంతింతై వటుడింతై అన్న చందంగా వేలాది మంది విద్యార్థులతో గురుకుల్ విద్యాలయం కళకళలాడింది. బన్సీలాల్ వ్యాస్ జీ పేద విద్యార్థుల కోసం ఉచిత హాస్టల్‌ను ఏర్పాటు చేయడమే కాక విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు 100కు పైగా ఆవులను సైతం కొనుగోలు చేసి గోశాలను ఏర్పాటు చేసి నిస్వార్థంగా సేవ చేశారు. వీరి గొప్పతనాన్ని చూసి ముందుకొచ్చిన దాతలు అప్పట్లో నగరంలోని మాదాపూర్, హైటెక్ సిటీ ప్రాంతంలో 627 ఎకరాల భూమిని దానంగా ఇచ్చారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో 4 ఎకరాల భూమిని సేకరించి 1951 సెప్టెంబర్ 7న గురుకుల్ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించారు. ఘట్‌కేసర్‌లో పాఠశాల నిర్వహణ కోసం 26 ఎకరాల భూమిని సేకరించారు. తన భార్య నగలు కూడా అమ్మి విద్యాలయ అభివృద్ధికి త్యాగం చేశాడు బన్సీలాల్ వ్యాస్ జీ. నిజాం ప్రభుత్వ తీరును నిరసించి జైలు జీవితం కూడా అనుభవించాడు.అంతటి వ్యక్తి 1956 సెప్టెంబర్ 1న జరిగిన రైలు ప్రమాదాంలో మృతి చెందాడు. ఆ తర్వాత కాలంలో వచ్చిన అనేక మార్పుల వల్ల సంస్థ పూర్వ వైభవం కోల్పోయింది. సంస్థకు చెందిన ట్రస్టు సభ్యులు నగరంలో ఉన్న 627 ఎకరాల భూమిలో 100 ఎకరాలకు పైగా అమ్మకాలు జరిపి గోల్‌మాల్ చేయటంతో గుర్తించిన అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ ట్రస్టును రద్దు చేసి పాఠశాల, కళాశాల పోషణార్థం, భూముల నిర్వహణ మొత్తం దేవాదాయ శాఖకు అప్పగించింది. 1989లో గురుకుల్ పాఠశాల, కళాశాల, సంస్థకు చెందిన భూములను దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకున్నారు. కానీ సంస్థ ఎదుగుదలను పట్టించుకోక గాలికి వదిలివేయటంతో సంస్థ వినాశనానికి దారి తీసింది. ఉపాధ్యాయులు, లెక్చరర్లు పదవీ విరమణ కాగానే నియామకాలు చేపట్టలేదు. సంస్థల మౌలిక వసతుల కల్పన జరుగలేదు. దీంతో విద్యార్థుల చేరిక లేకుండా పోయింది. కళాశాల కనుమరుగయ్యే పరిస్థితి నెలకొనటంతో పూర్వ విద్యార్థులు కొంత మంది కలుగుజేసుకుని తరగతి గదులు, కొంత మేర ఫర్నీచర్‌ను సమకూర్చారు. కాని దేవదాయ శాఖ మాత్రం స్పందించలేదు.

### దర్శన మిస్తున్న పురాతన భవనాలు

గురుకుల్ సంస్థలోకి వెళ్లగానే పురాతన భవనాలు దర్శనమిస్తాయి. దయ్యాల కొంపగా వెలుగొం దుతున్నాయి. రాత్రిపూట విద్యుత్ సరఫరా ఉండదు. కాపలదారుడు ఉండకపోవటంతో పోకిరీలు డ్రగ్స్, వ్యభిచారం వంటి అసాంఘిక కార్యకలపాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి.

### వెలకట్టలేని ఆస్తులు ఉన్నా..ఆర్థిక సంక్షోభం

సంస్థకు చెందిన భూముల విలువ వెలకట్టలేనివి. నగరంలోని హైటెక్ సిటీ ప్రాంతంలో ఉన్నభూములకు రూ.50వేల కోట్లకు పైగా విలువ ఉంటుంది. నాందేడ్‌లో 4 ఎకరాలు, ఘట్‌కేసర్‌లోని 26 ఎకరాల భూమికి గాను 3 ఎకరాల భూమిని రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి వాడుకున్నందుకు గాను రూ.4 కోట్ల నిధులు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. హైటెక్ సిటీ వద్ద సంస్థ భూమిలో ఉన్న పెట్రోల్ బంక్‌ల నుంచి అద్దె నెలకు రూ.3.5 లక్షల ఆదాయం వస్తుంది.అంత ఆదాయం ఉన్న గురుకుల్ అభివృద్ధికి నిధుల కేటాయింపు జరుగతలేదు.సంస్థకు చెందిన ఆస్తుల విలువ వేల కోట్లలో ఉన్నా, నెలసరి ఆదాయం వస్తున్న గురుకుల్ అభివృద్ధికి నిధులు కేటాయించకపోవటంతో విద్యాలయం నిర్వీర్యమైంది. ఆస్తుల పరిరక్షణకు చర్యలు లేవు, విద్యార్థుల బోధనకు ఉపాధ్యాయులు లేరు. తరగతి గదులకు భవనాలు లేవు.

### ఉత్తరాల ఉద్యమానికి శ్రీకారం

ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్న గురుకుల్ విద్యాలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని పూర్వ విద్యార్థులు ముందుకొచ్చి ప్రభుత్వ అధికారులు, సీఎం,మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ప్రాధేయపడుతున్నారు. అయినా ఎవరు స్పందించక పోవటంతో గురుకుల్ పూర్వ విద్యార్థి అబ్బసాని యాదగిరి యాదవ్ సేవ్ గురుకుల్ నినాదంతో ఉత్తరాల ఉద్యమాన్ని చేపట్టి పూర్వ విద్యార్థులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆయా శాఖల కమిషనర్లు, తహసీల్దార్ వరకు నిత్యం సేవ్ గురుకుల్ పేరిట ఉత్తరాలను పోస్టు చేస్తు విన్నవిస్తున్నారు.



గురుకుల్‌లో శిథిలావస్థలో గ్రంథాలయం భవనం



కూలిపోయిన గురుకుల విద్యార్థుల విశ్రాంతి గదులు

### దేవాదాయ శాఖనే కారణం



గురుకుల్ సంస్థను దేవాదాయ శాఖ 1989లో స్వాధీనం చేసుకుంది. అప్పటి నుంచే సంస్థ ప్రమాదంలో పడింది. ఏనాడు పట్టించుకోలేదు. నిధులు మంజూరు చేయలేదు. నియమకాలు చేపట్టలేదు. సంస్థ నిర్వీర్యానికి ప్రధాన కారణమే దేవాదాయ శాఖ. తక్షణమే వైదొలిగి గురుకుల్ విద్యాలయ సంస్థను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలి. పట్టణంలో ఉన్న బాల, బాలికల ఉన్నత పాఠశాల లను గురుకుల విద్యాలయం ఆవరణలోకి తీసుకువచ్చి విద్యాలయాల సముదాయాన్ని ఏర్పాటు చేయాలి.

**-మాజీ సర్పంచ్, పూర్వ విద్యార్థి అబ్బసాని యాదగిరి**

### గురుకుల్‌కు పూర్వ వైభవం కల్పించాలి



గురుకుల్ వ్యవస్థాపకుడు బన్సీలాల్ వ్యాస్ జీ ఉన్నత ఆశయంతో చక్కటి భవనాలు నిర్మించి సంస్థను స్థాపించాడు. దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకున్న తర్వాత ఆలనా పాలనా లేక భవనాలు శిథిలావస్థలోకి చేరుకున్నాయి. ఏనాడు అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకో లేదు.సంస్థ నిర్వీర్యం అవుతుంటే చాలా బాధగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే చర్యలు చేపట్టి గురుకుల్‌కు పూర్వ వైభవం కల్పించాలి.

**-పూర్వ విద్యార్థి కంది ప్రేమ్ కుమార్**

### 'ఉత్తరాల ఉద్యమాన్ని' ఆపేది లేదు

**ఘట్ కేసర్, మార్చి 10:** గురుకుల్ విద్యాలయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం దిగివచ్చే వరకు ఉత్తరాల ఉద్యమాన్ని కొనసాగిస్తామని గురుకుల్ పూర్వ విద్యార్థి, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ అన్నారు. ఘట్ కేసర్ పట్టణంలోని గురుకుల్ విద్యాలయాన్ని అభివృద్ధి చేసి పూర్వ వైభవం తీసుకురావాలని సేవ్ గురుకుల్ ఉద్యమంలో భాగంగా చేపట్టిన ఉత్తరాల ఉద్యమం 36వ రోజుకు చేరుకుంది. సోమవారం పూర్వ విద్యార్థి సూర్యదేవ్ మోరే ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలకు ఉత్తరాలను పోస్టు చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రేమ్ కుమార్, సార శ్రీనివాస్ గౌడ్, ప్రవీణ్ కుమార్ యాదవ్, ఇమ్మూ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తరాలను పోస్టు చేస్తున్న పూర్వ విద్యార్థులు

## సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



**రామంతాపూర్:** జ్యోతిరావుపూలే సేవా సంఘం ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మహేందర్ ముదిరాజ్ తదితరులు.



**ఉప్పల్ :** బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారుడు పిట్టల నరేశ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో చిల్కానగర్ చౌరస్తాలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



**కాప్రా:** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రంస్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్‌లో సావిత్రిబాయిపూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



**మల్కాజిగిరి:** మౌలాలి భరత్ నగర్‌లోని కార్యాలయం బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు.

## ఘనంగా మహిళా దినోత్సవం

**రామంతాపూర్,మార్చి 10:** నాచారం డివిజన్ వార్డు కార్యాలయంలో సోమవారం డివిజన్‌లో పనిచేస్తున్న మహిళా పారిశుధ్య కార్మికులతో కలిసి కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ సోమవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. వారితో కేక్ కట్ చేయించి వారికి కానుకలు అందజేశారు. అదేవిధంగా రామాంతాపూర్ డివిజన్, కామాక్షిపురం కమ్యూనిటీహాల్‌లో ఏఐవీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ గంధం జోత్స్న నాగేశ్వరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మహిళలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి

## పరిజ్ఞానం పెంపునకు అంతర్జాతీయ సదస్సులు దోహదం



సదస్సు బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న జేఎన్‌టీయూహెచ్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ కామాక్షి ప్రసాద్, సీఎంఆర్ వైస్ చైర్మన్ అభినవ్ రెడ్డి

**మేడ్చల్, మార్చి 10:** అంతర్జాతీయ సదస్సులు పరిజ్ఞానం పెంపునకు దోహదం చేస్తాయని జేఎన్‌టీయూహెచ్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ కామాక్షి ప్రసాద్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో సోమవారం కంప్యూటర్ సెక్యూరిటీ, ఇమేజ్ ప్రాసెసింగ్, గ్రాఫిక్స్, మొబిలిటీ తదితర అంశాలపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనారు.కార్యక్రమంలో సీఎంఆర్ చైర్మన్ గోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ అభినవ్ రెడ్డి, డైరెక్టర్ రాజి రెడ్డి, ఆర్అండ్‌డీ డీన్ సృజన్ రాజు, నరేశ్ కుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

**మేడ్చల్ రూరల్ మార్చి 10:** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన దానమ్మ గారి మహేందర్ రెడ్డికి మంజూరైన రూ.38,500ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు అమరం జైపాల్ రెడ్డి, అమరం హేమంత్ రెడ్డి సోమవారం లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి సొంగారి సత్తి రెడ్డి, నాయకులు బొప్పిడి జీత్ రెడ్డి, బండారి రాజు, టి. కృష్ణ రెడ్డి, బొప్పిడి నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'ఓయో'లో పేకాట..పలువురు అరెస్టు

**పోచారం,మార్చి10:** పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని నవ్యగ్రాండ్ ఓయో హోటల్ గదిలో పేకాట ఆడుతున్న 8 మందిని పోలీసులు సోమవారం రాత్రి అరెస్టు చేశారు. సీఐ రాజు కథనం ప్రకారం.. హోటల్ గదిలో కొంత మంది యువకులు 3కార్డ్స్ గేమ్ ఆడుతున్నట్లు పక్కా సమాచారం అందడంతో అక్కడికి వెళ్ళి పరిశీలించిన పోలీసులకు 8మంది వ్యక్తులు ఉన్నట్లు గుర్తించారు. వీరిలో మహ్మద్ అబ్బాస్ అలీ ఘట్‌కేసర్ బ్రూక్‌బాండ్ కాలనీ,జి.సురేష్ బుగ్గానగర్ ఘట్‌కేసర్,టి.కిషన్‌ఘట్‌కేసర్,మామిళ్ళ వెంకటేశ్ ఘట్‌కేసర్,గుండ్ల సిద్దార్థ ఘట్‌కేసర్,మొలుగు సంతోష్,ముదుగాని మధవ్ ఘట్‌కేసర్ ,గోపి హోటల్ యజమాని, పేకాట నిర్వాహకులు ఉన్నారు.రూ.27,600నగదు,7మొబైల్ ఫోన్లు,3 సెట్స్ కార్డ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గురుకుల్ గ్రౌండ్‌లోకి మురుగునీటి ప్రవాహాన్ని ఆపాలి

**ఘట్ కేసర్, మార్చి 10:** ఘట్‌కేసర్ పట్టణంలోని గురుకుల్ విద్యాలయ గ్రౌండ్‌లో ప్రవహిస్తున్న మురుగు నీటిని వెంటనే నిలిపివేయాలని ఘట్‌కేసర్ మున్సిపల్ బీఆర్ఎస్ నాయకుడు పల్లె విజయ్ గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనకు దిగుతామని తెలిపారు. ఫిర్యాదు పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారలో ఎండీ నజీర్, ప్రకాశ్, రవికాంత్ ముదిరాజ్, సంజయ్‌గౌడ్, గణేశ్‌గౌడ్, గుండ్ల శ్రీను, మోహన్, నితిన్ తదితరులు ఉన్నారు.

## గంజాయి విక్రేతపై కేసు

**మేడ్చల్‌మార్చి 10:** మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్ రోడ్డులో ఎక్సైజ్ అధికారులు సోమవారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి చిక్కాడు. గంజాయి అరికట్టడంలోభాగంగా సబ్ ఇన్స్పెక్టర్ రాఘువేశ్వర్రావు ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహిస్తుండగా ఒడిశాకు చెందిన సమర్ సర్కార్ 3.5 కిలో ఎండు గంజాయితో పట్టుబడ్డాడు. అధికారులు విచారణలో నిందితుడు గత కొంతకాలంలో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నాడని తేలింది. గంజాయిని స్వాధీనం చేసుకొని, అతడిపై కేసు నమోదు చేశారు.

## సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్ ఇలంబర్తిని కలిసి వినతి పత్రం అందిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్ కుమార్

**మల్కాజిగిరి, మార్చి 10:** మల్కాజిగిరి నియోజకవర్గంలోని కొన్ని చెరువులు హెచ్‌ఎండీఏ పరిధిలో మరికొన్ని జీహెచ్‌ఎంసీలో ఉండటంతో అభివృద్ధి జరగడంలేదని సోమవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయం లో కమిషనర్ ఇలంబర్తికి మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రమణ్ కుమార్ వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు గుర్రపు డెక్క తీసివేత, లైట్స్, స్వీపింగ్, టాయిలెట్స్ నిర్వహణ, పార్కులు తదితర పనులన్నీ జీహెచ్‌ఎంసీ చేస్తుంటే హెచ్‌ఎండీఏ మాత్రం కమర్షియల్ వ్యాపారానికి అనుమతులతో డబ్బులు దండుకుంటుందని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రంలో కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

## వేసవిలో నీటి ఎద్దడిని అరికట్టాలి

**శామీర్‌పేట, మార్చి 10:** రానున్న వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని తూంకుంట మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి సంధ్య అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ఆమె కమిషనర్ వెంకట గోపాల్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అప్పుడే ఎండలు కాస్తున్నందున తాగునీటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఎక్కడా కూడా ఇబ్బందుల తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పర్యటనలో భాగంగా సీఐఎస్ఎఫ్ క్యాంపస్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. బయో మైనింగ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ సునీత, ఆర్వో అర్షద్ అహ్మద్, ఆర్ఐలు భాస్కర్, రేణుక, సిబ్బంది పాల్గొన్నారు.

## మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యం

**పీర్జాదిగూడ మార్చి 10:** మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రం రాంచీ జిల్లాకు చెందిన నితీశ్ కుమార్ (20) మతిస్థిమితం సరిగా లేకపోవడంతో గతనెల 28న ఇంటి నుంచి నగరానికి వచ్చి చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో తిరుగుతుండగా విషయం తెలుసుకున్న పోలీసులు మేడిపల్లిలోని అమ్మ ఆశ్రమం ఫౌండేషన్‌లో చేర్పించారు. అయితే ఈనెల 1న ఆశ్రమం నుంచి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆశ్రమం నిర్వాహకులు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## యతిన్ మృతదేహం లభ్యం

**జవహర్‌నగర్, మార్చి 10:** క్వారీగుంతలో మునిగిపోయిన యతిన్ నాయుడు మృతదేహాన్ని సోమవారం వెలికితీశారు. జవహర్‌నగర్ ఎస్‌హెచ్‌వో సైదయ్య కథనం ప్రకారం.. సికింద్రాబాద్ తిరుమలగిరికి చెందిన సీజీ గీతా నాయుడికి ఇద్దరు కుమారులు యతిన్‌నాయుడు(19), తనీష్‌నాయుడుతో కలిసి నివసిస్తున్నారు.ఆదివారం సరదాగా గడుపుదామని అన్నదమ్ములు, మరో ఇద్దరు స్నేహితులతో కలిసి మల్కారం గుట్టలకు వచ్చి ఫంటో షూట్ చేసుకుందామని ఆనందంతో వచ్చి క్వారీ గుంతో మునిగిపోయాడు. ఈత రాకపోవడంతో మిగతా స్నేహితులు ఏమి చేయలేని స్థితిలో ఉండిపోయారు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించగా సోమవారం ఉదయం మృతదేహాన్ని బయటకు తీశారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న దర్యాప్తు చేస్తున్నారు.

## చికెన్‌షాపు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విజయ్‌కుమార్

**నేరేడ్‌మెట్, మార్చి 10:** మల్కాజిగిరి చికెన్‌షాప్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విజయ్‌కుమార్ విజయం సాధించాడు. ఈ ఎన్నికలు సోమవారం వినాయకనగర్‌లో మాజీ అధ్యక్షుడు గడ్డమీది రాజు ఆధ్వర్యంలో జరిగాయి. విజయ్‌కుమార్, హిదాయత్‌లు అధ్యక్షునిగా పోటీలో నిలబడగా విజయ్‌కుమార్ 75ఓట్లతో విజయం సాధించాడు. వైస్ ప్రెసిడెంట్ నరేష్, జనరల్ సెక్రటరి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారిగా నరేందర్‌రెడ్డి, అడ్వైజర్‌గా రాజేష్‌కుమార్‌లను ఎకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. పలు డివిజన్ల ఇన్‌చార్జీలుగా గోపాల్, వెంకటేష్, సత్యనారాయణ, రాజమౌలి, కన్నాయాదవ్, ఖాసీంలను నియమించినట్లు చెప్పారు.



విజయ్‌కుమార్‌ను అభినందిస్తున్న చికెన్‌షాపు ఓనర్స్ అసోసియేషన్ మెంబర్లు

**తెలంగాణ గ్రామీణ బ్యాంక్**
ఉప్పల్‌బ్రాంచ్, #2-7/10, 1వ అంతస్తు, లక్ష్మారెడ్డి కాలనీ,
ఉప్పల్, హైదరాబాద్-500 009, ఫోన్: 9491041915.

**షేక్ వాజిద్, తండ్రి: షేక్ యాసిన్ యొక్క బంగారు ఆభరణాల వేలం**

మా రుణగ్రహీత శ్రీ షేక్ వాజిద్, తండ్రి: షేక్ యాసిన్ మా శాఖ నుండి రెండు గోల్డ్ లోన్స్ పొందారు మరియు అతను సదరు లోన్ తిరిగి చెల్లించలేక పోయారు మరియు సదరు ఖాతాలు NPAగా మారినవని తెలియజేయడమైనది. బ్యాంక్ నిర్దేశించిన సూచనల ప్రకారం లోన్ పొందినప్పుడు తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను మేము వేలం వేయవలసి వుంటుంది మరియు సదరు లోన్ ఖాతా మూసివేయబడుతుంది.

**18-03-2025వ తేది మధ్యాహ్నం 3.00 గంటలకు బ్యాంక్ ఆవరణలో ఆభరణాల వేలం నిర్వహించబడుతుంది**

| క్ర.సం. | ఖాతా నెం. | రుణగ్రహీత పేరు & చిరునామా | మంజూరు తేది | ఆభరణాల స్థూల బరువు | ఐటంలు |
|---|---|---|---|---|---|
| 1. | 79077423238 | పేరు: షేక్ వాజిద్, తండ్రి: షేక్ యాసిన్ చిరునామా: ఇం.నెం. 12-62, వీకర్ సెక్షన్, పీర్జాదిగూడ, హైదరాబాద్, ఫోన్: 8179834640. | 05-01-2024 | 13.50 గ్రా. | నెక్లెస్-1 ఇయర్ రింగ్స్-2 మొత్తం-3 |
| 2. | 79074156423 | పేరు: షేక్ వాజిద్, తండ్రి: షేక్ యాసిన్ చిరునామా: ఇం.నెం. 12-62, వీకర్ సెక్షన్, పీర్జాదిగూడ, హైదరాబాద్, ఫోన్: 8179834640. | 21-07-2023 | 46.19 గ్రా. | నెక్లెస్-2 టాప్స్-2 చెయిన్-1 రింగ్-1 మొత్తం-6 |

సం/- బ్రాంచ్ మేనేజర్

**J V S స్విచ్ గేర్స్ LLP**
**LLPIN: AAL-4282**

దిగువ తెలిపిన వారికి,
**రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, తెలంగాణ**
2వ అంతస్తు, కార్పొరేట్ భవన్, జిఎస్ఐ పోస్ట్, తట్టిఅన్నారం నాగోల్, బండ్లగూడ, హైదరాబాద్-500068, తెలంగాణ

**ఫారం నెం.URC-2**
**చాప్టర్ XXI యొక్క పార్ట్ I క్రింద రిజిస్ట్రేషన్ గురించి నోటీస్ ఇస్తూ ప్రకటన**
[కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 374(b) మరియు కంపెనీల (ఆథరైజ్డ్ టు రిజిస్ట్రార్) రూల్స్, 2014లోని రూల్ 4(1)ను అనుగుణంగా]

1. J V S **స్విచ్ గేర్స్** LLP **ఒక** LLPను కంపెనీ లిమిటెడ్ బై షేర్స్‌గా కంపెనీల చట్టం, 2013లోని చాప్టర్ XXIలోని పార్ట్ I క్రింద నమోదు కావచ్చునని ROC **హైదరాబాద్** వద్ద రిజిస్ట్రార్‌కు దరఖాస్తు చేయుటకు కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 366లోని సబ్-సెక్షన్ (2)కు అనుగుణంగా నోటీసు ఇవ్వడమైనది.
2. కంపెనీ యొక్క ప్రధాన లక్ష్యాలు దిగువ విధంగా ఉన్నాయి:
ఎ) H&T ప్యానెల్స్, పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్, కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్స్ (CT), పొటెన్షియల్ ట్రాన్స్‌ఫార్మర్స్ (PT), సింగిల్ & త్రీ-ఫేజ్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్, హై వోల్టేజ్/ హై కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్స్, రెక్టిఫైర్, స్పెషల్ పర్పస్ మరియు ఫర్నేస్ ట్రాన్స్‌ఫార్మర్స్‌తో సహా, ఇండస్ట్రియల్ ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్ తయారీ, స్థాపన, నిర్వహణ మరియు మరమ్మతుల వ్యాపారం చేపట్టుట. అదనంగా ఎలక్ట్రికల్ మోటార్స్, ఐసోలేటర్స్, ఇన్సులేటర్స్, లైటింగ్ & సర్జ్ అరెస్టర్స్, సర్జ్ కౌంటర్స్, ఎలక్ట్రికల్ ప్యానెల్స్, బస్ బార్ డక్ట్స్, డై-క్యాస్టింగ్ కనెక్టర్స్ మరియు ఇతర సంబంధిత మెటీరియల్స్ తయారీ మరియు సర్వీస్.
బి) డిజైన్, అమలు మరియు నిర్వహణతో సహా సబ్‌స్టేషన్ నిర్మాణం కొరకు కాంట్రాక్ట్స్ మరియు సబ్ కాంట్రాక్ట్స్ చేపట్టుట. ఇన్వెర్టర్స్, ట్రాన్స్‌ఫార్మర్స్, స్విచ్‌గేర్, మోటార్స్, మరియు వివిధ సిస్టమ్స్‌కు పవర్, టెలికమ్యునికేషన్ మరియు ఇండిస్ట్రియల్ అప్లికేషన్స్ కొరకు ఇండస్ట్రియల్ ఆటోమేషన్‌తో సహా కండక్టర్స్, కేబుల్స్ మరియు పవర్ ఎలక్ట్రానిక్స్ తయారీ, ట్రేడ్, దిగుమతి, ఎగుమతి మరియు సర్వీస్.
3. ప్రతిపాదిత కంపెనీ యొక్క ముసాయిదా మెమొరాండం మరియు ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ కాపీని సర్వే నెం.79, ప్లాట్ నెం.డి3, ఫేజ్-IV IDA జీడిమెట్ల, గాజులరామారం గ్రామం, హైదరాబాద్, హైదరాబాద్, తెలంగాణ, ఇండియా, 500055 వద్ద ఆఫీస్ నందు తనిఖీ చేసుకొవచ్చును.
4. ఈ దరఖాస్తుకు అభ్యంతరం తెలిపే ఎవరైనా వ్యక్తి తమ అభ్యంతరాన్ని వ్రాతపూర్వకంగా 9HCQ+GG2, GSI పోస్ట్, తట్టి అన్నారం, కార్పొరేట్ భవన్ రోడ్, నాగోల్, బండ్లగూడ, హైదరాబాద్, తెలంగాణ-500068 రిజిస్ట్రార్‌కు, దాని నమోదిత కార్యాలయం వద్ద కంపెనీకి ఒక కాపీతో ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి ఇరవై ఒక్క రోజులు (21 రోజులు) లోగా తెలుపవచ్చును.

దరఖాస్తుదారుల పేరు
తేది: 10-03-2025
**అభినవ్ కుమార్ రెడ్డి జంబాపురం**
**వనజ జంబాపురం**